హిమాయత్‌సాగర్‌కు తగ్గిన వరద

ఔటర్ సబ్ రోడ్డుపై రాకపోకలు పునరుద్ధరణ



వరదనీటితో హిమయత్‌సాగర్

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి హిమయత్‌సాగర్ జలాశయంకు ఎగువ ప్రాంతాల నుండి వస్తున్న వరద ఉధృతి తగ్గడంతో ఆదివారం జలాశయం ఒక క్రస్ట్ గేటు మూడు ఫీట్‌ల మేర ఎత్తి ఉంచగా 990 క్యూసెక్కుల నీరు ఈసీ నదిలోకి వదిలారు. ఇన్‌ఫ్లో 1000 క్యూసెక్కులు ఉంది. వరదనీరు తగ్గడంతో హిమాయత్‌సాగర్ నుంచి రాజేంద్రనగర్ వెళ్లే ఔటర్ సబ్ రోడ్డుపై రాకపోకలు పునరుద్ధరించారు. జలాశయం పూరిస్థాయి నీటి మట్టం 1763.50 అడుగులు కాగా ప్రస్తుత నీటి మట్టం 1762.15 అడుగులు ఉందని జలమండలి డీజీఎం గోవింద్‌గౌడ్ తెలిపారు.

గంటపాటు దంచికొట్టిన వాన

విద్యుత్ సరఫరాకు అంతారాయం



మణికొండ సెక్రటేరియట్ కాలనీలోని త్రివేణి స్కూల్‌లోకి వచ్చిన వరద నీరు

మణికొండ: రోజంతా ఎండ, ఉక్కపోతగా ఉన్న వాతావరణం రాత్రి అయ్యే సరికి ఒక్కసారిగా మారిపోయి కుండపోతగా వర్షం కురిసింది. మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిలో ఆదివారం రాత్రి 7.30 గంటలకు మొదలైన వర్షం గంట పాటు ఆగకుండా కురిసింది. దాంతో స్థానికంగా ఉన్న రోడ్లు జలమయం అయ్యాయి. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని ఈవీవీ కాలనీ, అంజలి గార్డన్, సెక్రటేరియట్ కాలనీ, భాగ్యలక్ష్మి కాలనీ, కేపీఆర్ కాలనీ, బాలాజీనగర్ కాలనీలలో నీరు అపార్ట్‌మెంట్‌లు, గృహాలు, స్కూల్‌లోకి వచ్చాయి. నార్సింగి మున్సిపల్ కేంద్రంతో పాటు మంచిరేవుల, గండిపేట, కోకాపేటలలో భారీ వర్షంతో రోడ్లన్నీ జలమయం అయ్యాయి. భారీ వర్షంతో రోడ్లపై ట్రాఫిక్‌తో పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. గంట తరువాత వర్షం తగ్గటంతో వరద నీరంతా వెళ్లిపోయింది. విద్యుత్ సరఫరాను సిబ్బంది ఎప్పటికప్పుడు పునరుద్ధరించారు.




ఈవీవీ కాలనీలో జలమయమైన రోడ్డు

సందడిగా ముస్లింల ర్యాలీలు



ర్యాలీలో పాల్గొన్న ముస్లింలు

శాస్త్రిపురం: మిలాద్ ఉన్ నబీ పర్వదినాన్ని పురస్కరించుకొని శాస్త్రీపురం, సులేమాన్‌నగర్ డివిజన్‌లలో ముస్లింలు ఆదివారం పెద్ద ఎత్తున ర్యాలీలను నిర్వహించారు. హసన్‌నగర్, శాస్త్రీపురం, సులేమాన్‌నగర్, ఎంఎం పహాడీ, నౌ నంబర్, వాదియామహ్మద్ కాలనీ, ఇంద్రానగర్, బాబానగర్ ప్రాంతాలలోని మసీదులలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మిలాద్ ఉన్ నబి శాంతి, దయ, కరుణ, ఐక్యత వంటి విలువలను గుర్తు చేస్తుందని ఈమామ్‌లు తెలిపారు. ఉపన్యాసాలు, ఖురాన్ పఠనాలు జరిపి మహ్మద్ ప్రవక్త బోధనలను వివరించారు. అనంతరం మసీదుల వద్ద అన్నదాన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఆయా ప్రాంతాలలో మిలాద్ ఉన్ బి ర్యాలీల సందర్భంగా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.



కిషన్‌బాగ్‌లో అబ్దుల్ హమీద్, షేక్ రియాజ్, గౌస్ అలీని సన్మానిస్తున్న ప్రతినిధులు

వరద కాలువల కనుమరుగు

- పంట పొలాలను ముంచెత్తుతున్న వరదనీరు
- రామంజాపూర్‌లో రైతుల ఆందోళన
- అలుగుకు అడ్డుగా నిర్మాణం
- రోడ్డుపై వరదనీటితో ఇబ్బందులు



ఫిరంగి కాలువ మూసుకుపోవడంతో పంట పొలాల్లోకి చేరుతున్న వరదనీరు

శంషాబాద్ రూరల్: అధికారుల ఉదాసీన వైఖరి.. రియల్టర్ల ఆగడాలతో వరద కాలువలు కనుమరుగయ్యాయి. కాలువలను చదును చేస్తూ.. అడ్డు గోడలు కట్టేస్తున్నారు. దీంతో వరదనీరు పంట పొలాలను ముంచెత్తుతోంది.. సాగుపై ఆధారపడిన రైతుల పంటలు నీట మునుగుతుండడంతో ఆందోళన చెందుతున్నారు. మండలంలోని రామంజాపూర్ పరిధిలో ఉన్న చెరువులు, కుంటలకు నీరు పారే వరద కాలువలు కబ్జాలకు గురయ్యాయి. ఈ ప్రాంతంలో ఉన్న ఫిరంగి కాలువ సైతం కనుమరుగైంది.

రేకుల కుంట అలుగు కాలువ...

రామంజాపూర్ శివారులో తండాకు వెళ్లే దారి పక్కన ఉన్న రేకుల కుంట భారీ వర్షాలకు నిండిపోయింది. అలుగు పారుతుండగా.. ఈ వరద నీరు వెళ్లే మార్గంలో రియల్టర్లు అడ్డు గోడ నిర్మించారు. కొన్నేళ్ల కిందట పట్టా భూముల చుట్టూ ప్రహరీ చేపట్టగా.. చెరువు అలుగు నీటికి అడ్డుగా మారింది. దీంతో వరద నీరు సమీప పొలాల్లోకి పారుతుండడంతో రైతులకు నష్టం వాటిల్లుతోంది.

పంట పొలాల్లోకి...

రేకుల కుంట నుంచి అలుగు పారిన నీరు వరద కాలువ గుండా ఫిరంగి కాలువలోకి చేరుతుంది. ఇక్కడి నుంచి బోటిగూడ చెరువులోకి వెళ్తుంది. అయితే ఫిరంగి కాలువను పూడ్చి వేసిన రియల్టర్లు నిర్మాణాలు చేపట్టి రోడ్డు వేశారు. దీంతో వరద నీరు సమీపంలోని పంట పొలాల్లోకి వెళ్తుంది. సుమారు 15 ఎకరాల పంటను ముంచెత్తింది. వరి, కూరగాయల పంటలు సాగు చేసిన రైతుల పొలాలకు వరద నీరు రావడంతో ఆందోళన చెందుతున్నారు.

రాకపోకలకు ఇబ్బందులు...

రామంజాపూర్‌తండాకు వెళ్లే రోడ్డు మార్గంలో వరదనీరు నిలిచిపోయింది. ఎగువ నుంచి వస్తున్న నీరు రేకుల కుంటలోకి చేరి.. అలుగు ద్వారా బయటకు వెళ్లాలి. అయితే ఇక్కడ ప్రహరీ అడ్డుగా మారడం.. కాలువ మూసుకుపోవడంతో.. నీరు రోడ్డుపైకి చేరుతుంది. దీంతో తండాకు వెళ్లే గిరిజనులు, అటు వైపు రాకపోకలు సాగించే రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత వారం రోజులుగా ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఫిరంగి కాలువపై అక్రమ నిర్మాణాలు...

రామంజాపూర్, బోటిగూడ గ్రామాల మీదుగా ఉన్న ఫిరంగి కాలువ కబ్జా కోరల్లో చిక్కుకుంది. కాలువను పూడ్చి వేసిన అక్రమార్కులు కొన్ని చోట్ల నిర్మాణాలు చేపట్టారు. కాలువను కుదించి కాంక్రీట్ గోడలు నిర్మించారు. దీంతో వరదనీరు వెళ్లడానికి ఆటంకాలు ఎదురవుతున్నాయి. భారీ వర్షాలతో చెరువులు, కుంటలు నిండుకున్నాయి. గొలుసు కట్టు చెరువులకు నీరు పారేలా నిజాం కాలంలో ఏర్పాటు చేసిన ఫిరంగి కాలువ రోజు రోజుకు కనుమరుగవుతోంది.

> **సమస్య పరిష్కారానికి చర్యలు**
>
> చెరువు అలుగు వద్ద పట్టా భూమిలో గతంలో గోడ నిర్మించారు. నీటికి అడ్డంకులు ఏర్పడుతున్నట్లు గుర్తించాము. ఫిరంగి కాలువ సైతం మూసుకుపోయింది. సమస్య ఉన్న ప్రాంతాలను పరిశీలించి వాటి పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటాం.
>
> – మౌనిక, ఏఈ, ఇరిగేషన్



కబ్జాకు గురైన ఫిరంగి కాలువ



రేకులకుంట అలుగు వద్ద అడ్డుగా నిర్మించిన ప్రహరీ



రామంజాపూర్‌తండాకు వెళ్లే రోడ్డుపై నిలిచిన వరదనీరు

ఉచిత వైద్య శిబిరాలతో పేదలకు మేలు



వైద్యులను సత్కరిస్తున్న మాజీ చైర్మన్ నరేందర్‌ముదిరాజ్

మణికొండ: సేవా సంస్థలు, కార్పొరేట్ ఆస్పత్రుల వారు ఏర్పాటు చేస్తున్న ఉచిత వైద్య శిబిరాలతో బస్తీల్లోని పేద ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని మణికొండ మున్సిపల్ మాజీ చైర్మన్ కె.నరేందర్‌ముదిరాజ్ అన్నారు. ఆదివారం మణికొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో స్థానిక వీఆర్4 సహయోగ్ చారిటబుల్ ట్రస్ట్, శ్రీధర్ క్లినిక్‌లు సంయుక్తంగా నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రస్తుత పరిస్థితిలో ప్రతి ఒక్కరూ తరచూ ఆరోగ్య పరీక్షలు చేయించుకుని వైద్యుల సలహాలను పాటించాల్సిన అవసరం ఉందన్నారు. ఇలాంటి ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అవసరమైన రోగులకు ఉచితంగా మందులను పంపిణీ చేశారు. అనంతరం వైద్య సేవలు అందించిన డాక్టర్లను ఘనంగా సన్మానించారు. సేవా సంస్థ నిర్వాహకుడు లక్ష్మణ్‌రావు, డాక్టర్ ప్రభావతి, మాజీ కౌన్సిలర్ కె.రామకృష్ణారెడ్డి, నాయకులు కిరణ్‌కుమార్, పురుషోత్తం, జితేందర్ తదితరులు పాల్గొన్నారు.

సేవా పక్షోత్సవాలను విజయవంతం చేద్దాం

బీజేపీ జిల్లా నాయకుడు లక్ష్మీనారాయణ

మణికొండ: బీజేపీ జాతీయ నాయకత్వం పిలుపు మేరకు ఈ నెల 17వ తేదీ నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు సేవా పక్షోత్సవాలను ఘనంగా నిర్వహించి కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని ఆ పార్టీ జిల్లా నాయకుడు డి. లక్ష్మీనారాయణ అన్నారు. ఆదివారం నార్సింగి మున్సిపాలిటీ అధ్యక్షుడు ఎం.నగేష్‌యాదవ్ అధ్యక్షతన ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 17వ తేదీన జాతీయ జెండాల ఆవిష్కరించి, రక్తదాన శిబిరాన్ని నిర్వహించాలన్నారు. నాయకులు సి.హెచ్.భిక్షపతి యాదవ్, జి.శివరాజ్, కె.ప్రభాకర్, డి.నాగేష్, బ్రహ్మచారి, అరవింద్, సురేష్, జైదీప్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

వరదతో అండర్‌పాస్‌లో రాకపోకలు బంద్



సంఘీగూడ వద్ద అండర్‌పాస్‌లో నిలిచిన వరదనీరు

భారీ వర్షాలతో తరచూ నీరు నిలుస్తున్న వైనం

శంషాబాద్ రూరల్: ఔటర్ రింగు రోడ్డులోని అండర్‌పాస్ రహదారి వరదనీటిలో చిక్కుకుంది. ఎగువ ప్రాంతం నుంచి వచ్చే వరదనీరు బయటకు వెళ్లే మార్గం లేక ఇక్కడే నిలిచిపోతోంది. మున్సిపాలిటి పరిధిలోని సంఘీగూడ చౌరస్తాలో ఔటర్ రింగు రోడ్డు అండర్‌పాసులో ఆదివారం భారీగా వరదనీరు వచ్చి చేరింది. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. పెద్దగోల్కొండ ఔటర్ జంక్షన్, పీ–వన్ రోడ్డు మీదుగా వచ్చే వాహనాలకు ఇబ్బందులు ఎదురయ్యాయి. విజయవాడ వైపు నుంచి బెంగళూరు వైపునకు రాకపోకలు సాగించే వాహనాలు ఈ రోడ్డు మార్గాన్ని ఆశ్రయిస్తాయి. భారీ వర్షాల నేపథ్యంలో సంఘీగూడ చెరువు నిండిపోయి అలుగు పారుతోంది. ఈ వరదనీటి కాలువను కబ్జా చేయడంతో సరైన కాలువ సౌకర్యం లేక నీరు అండర్‌పాస్‌లో నిలుస్తోంది. దీంతో తరచూ వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తప్పడంలేదు. ఆదివారం అండర్‌పాస్ నుంచి పెద్దగోల్కొండ ఔటర్ జంక్షన్ వరకు వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. స్థానికులు దూర ప్రాంతం నుంచి వెళ్లాల్సి వస్తుంది.

ప్రమాదకరంగా ఇనుప స్తంభం

- పొలాల్లో ఏళ్ల కిందట ఏర్పాటు
- ఎల్‌టీ, హెచ్‌టీ లైన్లతో పొంచి ఉన్న ప్రమాదం

శంషాబాద్ రూరల్: దశాబ్దాల కిందట ఏర్పాటు చేసిన కరెంటు ఇనుప స్తంభం ప్రమాదకరంగా మారింది. మండలంలోని చౌదరిగూడ శివారులో కొమ్ము కిష్టయ్య వ్యవసాయ పొలం వద్ద బోరు, బావులకు కరెంటు సరఫరా కోసం గతంలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. ఇందు కోసం ఇనుప స్తంభం గుండా కరెంటు తీగలను అమర్చారు. ఎప్పుడైనా ఫ్యూజులు పోయినా.. జంపర్ కట్ అయినా.. సిబ్బంది అందుబాటులో లేకుని సమయంలో స్థానిక రైతులు వెళ్లి మరమ్మతులు చేసుకుంటారు. అక్కడ ఇనుప కరెంటు స్తంభం ఉండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ విద్యుదాఘాతానికి గురై పశువులు మృత్యువాత పడ్డాయని రైతులు పేర్కొంటున్నారు.

ఒకే స్తంభంపై రెండు లైన్లు...

అసలే ఇనుప స్తంభం.. ఆపై రెండు లైన్లను ఏర్పాటు చేయడంతో మరింత ప్రమాదకరంగా మారింది. ఈ కరెంటు స్తంభం మీదుగా ఎల్‌టీ, హెచ్‌టీ లైన్లను ఏర్పాటు చేశారు. ఏళ్ల కిందట బిగించిన ఇనుప కరెంటు స్తంభం శిథిలావస్థలో ఉందని, దీన్ని తొలగించి సిమెంట్ స్తంభం ఏర్పాటు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.



చౌదరిగూడ శివారులో ఇనుప స్తంభం వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

క్యాబ్ డ్రైవర్ ఆత్మహత్య

కారు లోన్ వాయిదాల చెల్లించలేక మనస్తాపం



ఆత్మహత్య చేసుకున్న సాయిబాబా

శంషాబాద్ రూరల్: కారు లోన్ వాయిదాలు చెల్లించాలని ఫైనాన్స్ వారి నుంచి వచ్చిన వేధింపులతో మనస్తాపం చెందిన క్యాబ్ డ్రైవర్ ఆత్మహత్య చేసుకున్నాడు. మున్సిపల్ పరిధిలోని తొండుపల్లిలో ఈ ఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... వికారాబాద్ జిల్లా పూడూరు మండలం తుర్క ఎనికేపల్లికి చెందిన గుంతపల్లి సాయిబాబా(26) తొండుపల్లిలో నివాసముంటున్నాడు. ఇతను 2022లో ఎర్టిగా కారును లోను ద్వారా కొనుగోలు చేసి.. సోదరి రమ్య పేరుతో రిజిస్ట్రేషన్ చేశాడు. కొన్ని రోజులు కారును నడపగా.. లోన్ వాయిదాలు చెల్లించడానికి ఇబ్బందులు కావడంతో.. కారును ఎల్‌బీనగర్‌లోని ఎంఎస్ కార్స్ యజమాని మధుయాదవ్‌కు అమ్ముకున్నాడు. కొంత మొత్తం తీసుకున్న అతను.. లోన్ వాయిదాలను మధు యాదవ్ చెల్లించేలా ఇద్దరి మధ్య ఒప్పందం చేసుకున్నారు. మధు కారును నడుపుకొంటూ లోన్ వాయిదాలు చెల్లించకపోవడంతో.. ఫైనాన్స్ వారు సాయిబాబాపై ఒత్తిడి చేశారు. వాయిదాలు చెల్లించాలని మధును ఎన్నిసార్లు అడిగినా.. అందుకు అతను నిరాకరించడంతో పాటు నిర్లక్ష్యం చేశాడు. ఈ క్రమంలో ఫైనాన్స్ వారి ఒత్తిడి పెరిగి సాయిబాబా ఈ నెల 13న సాయంత్రం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. తాను చనిపోతున్నట్లు సోదరికి ఫోన్‌లో చెప్పాడు. అతన్ని వెతుక్కుంటూ వచ్చిన కుటుంబ సభ్యులు.. తొండుపల్లి రైల్వే వంతెన సమీపంలో మైసమ్మ గుడి వద్ద చెట్టు కింద ఉన్న సాయిబాబాను గుర్తించారు. నోట్లో నుంచి నురుగు కారుతుండగా.. అప్పటికే అతను మృతి చెందాడు. తన చావుకు మధు యాదవ్ కారణమంటూ రాసిన సూసైడ్ నోటును పక్కనే ఉన్న అతని కారులో కనుగొన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

క్రైస్తవుల సంక్షేమానికి కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

బండ్లగూడ: క్రైస్తవుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ అన్నారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి కిస్మత్‌పూర్‌లోని మెథడిస్ట్ చర్చి 22వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, తెలంగాణ క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్‌జాన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ... క్రిస్టియన్లు రాజకీయంగా, సామాజికంగా ప్రగతి సాధించాలన్నదే ప్రభుత్వ ఆకాంక్ష, అర్హులైన క్రిస్టియన్ మైనారిటీలకు సంక్షేమ పథకాలు అందిస్తామని తెలిపారు. కిస్మత్‌పూర్ మెథడిస్ట్ చర్చిలో 3 గంటల్లో 555 సార్లు కీర్తన 23వ అధ్యాయం పఠనం చేసి ప్రపంచ రికార్డు సృష్టించింది. రికార్డు సాధించిన అభ్యర్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ప్రపంచ రికార్డు సృష్టించినందుకు చర్చి సభ్యులందరూ ఆనందం వ్యక్తం చేస్తూ, ఉత్సవంగా వేడుకలను నిర్వహించుకున్నారు. పీఏసీఎస్ చైర్మన్ బి.రాందాస్ ముదిరాజ్, సాగర్‌గౌడ్, గోకరి సురేష్‌గౌడ్, శ్రీనాథ్‌రెడ్డి, సంగారెడ్డి, హరీష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ అభివృద్ధికి సహకరించాలి



మాట్లాడుతున్న బీజేపీ ఇంచార్జ్ తోకల శ్రీనివాస్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌ను అన్నివిధాలా అభివృద్ధి చేసేందుకు అవసరమైన ప్రాంతాల్లో దశలవారీగా అభివృద్ధి పనులను చేపట్టేందుకు కృషి చేస్తున్నానని బీజేపీ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇంచార్జ్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం కాటేదాన్‌లో డివిజన్ అధ్యక్షుడు పాండు యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ... డివిజన్‌లోని ప్రతి కాలనీలో స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటాలన్నారు. గాంధీజయంతి, నెహ్రూ జయంతి రోజుల్లో దివ్యాంగులకు సన్మాన కార్యక్రమాలు నిర్వహించాలని కార్యకర్తలను కోరారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ జన్మదినం, విశ్వకర్మ జయంతి, తెలంగాణ విమోచన దినోత్సవాలను పురస్కరించుకొని ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. సెప్టెంబర్ 17న రక్తదాన శిబిరం, జాతీయ జెండాల ఆవిష్కరణలకు సంబంధించిన ఏర్పాట్లపై చర్చించారు. పార్టీ నియోజకవర్గ కన్వీనర్ మల్లేష్ యాదవ్, నేతలు రావుల భాస్కర్, అడికె మహేందర్, సంతుగౌడ్, తలారి చిన్నా, మధుసూదన్‌రెడ్డి, బబ్లూ, ఎన్ను శంకర్‌రెడ్డి, సి.హెచ్.ప్రభుదాస్, రఘునాథ్, ఎం.డి.షకీల్, రామారావు, శేఖర్, యాదగిరి, బాబురావు, మధుసూదన్, రవి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పేద ముస్లిం యువతులకు సామూహిక వివాహాలు



వివాహాలు జరిగిన యువతులతో మసీదు కమిటీ నిర్వాహకులు

శాస్త్రిపురం: పేద ముస్లింలకు అండగా ప్రతి ఒక్కరూ నిలబడాలని శాస్త్రీపురం మైనారిటీ డెవలప్‌మెంట్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు హరున్‌రోషిద్ అన్నారు. ఆదివారం స్థానికంగా ఉన్న నురానీ మసీదులో ఏడుగురు నిరుపేద ముస్లిం యువతులకు వివాహాలు జరిపించారు. ప్రతి జంటకు రూ. 2 లక్షల విలువచేసే ఇంటి సామగ్రిని అందజేశారు. అనంతరం కమిటీ సభ్యులు మాట్లాడుతూ... పేద ముస్లిం యువతులకు వివాహాలు చేయాలనే ఉద్దేశంలో 2001 నుంచి ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఇప్పటి వరకు 145 జంటలకు వివాహాలు చేశామన్నారు. ప్రతి సంవత్సరం ముస్లిం యువతులకు వివాహాలు చేయడంతో పాటు ఆయా కుటుంబాలకు అండగా ఉంటున్నామన్నారు. కమిటీ సభ్యులు మహ్మద్ జహంగీర్, రఫీక్ ఉల్లాబుకారీ, షేక్ అన్సారీ, మహ్మద్ సలీం, మహ్మద్ ఫిరోజ్, మహ్మద్ పాషా, సర్వర్ తదితరులు పాల్గొన్నారు.

దాడులను సహించం

ఆల్ కాలనీస్ ఫెడరేషన్ అధ్యక్షుడు వంశీ



గాయపడిన రాజ్‌కుమార్‌ను పరామర్శిస్తున్న ఆల్ కాలనీస్ ఫెడరేషన్ నాయకులు

మణికొండ: సామరస్యంగా చర్చించుకుని కాలనీల అభివృద్ధికి కృషి చేయాల్సిన మాజీ ప్రజాప్రతినిధులు, కాలనీ సంక్షేమ సంఘాల నాయకులు అందుకు విరుద్ధంగా దాడులకు పాల్పడటం సహించమని ఆల్ కాలనీస్ ఫెడరేషన్ అధ్యక్షుడు అర్వపల్లి వంశీ అన్నారు. శనివారం మణికొండ మున్సిపాలిటీ, వెంకటేశ్వరకాలనీలో మాజీ కౌన్సిలర్ బి.పద్మారావు కాలనీ సంక్షేమ సంఘం నాయకుడు రాజ్‌కుమార్‌పై దాడి చేయటాన్ని ఫెడరేషన్ తీవ్రంగా ఖండించింది. ఆదివారం గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రాజ్‌కుమార్‌ను ఫెడరేషన్ బృందం పరామర్శించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తాము రాజ్‌కుమార్‌కు మద్దతుగా నిలుస్తామన్నారు. దాడులకు పాల్పడిన వారిపై పోలీసులు కఠినంగా వ్యవహరించాలని కోరారు. రాజ్‌కుమార్‌ను పరామర్శించిన వారిలో ఆల్ కాలనీస్ ఫెడరేషన్ ఉపాధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, కోశాధికారి రవీందర్‌రెడ్డి, సభ్యుడు కాంతారావు, అలకాపూర్ టౌన్‌షిప్ సంయుక్త కార్యదర్శి సంతోష్, శ్రీరాంనగర్ కాలనీ ఉపాధ్యక్షుడు శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మాజీ కౌన్సిలర్ కాంగ్రెస్‌లో లేదు...

వెంకటేశ్వరకాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధిపై దాడి చేసిన మాజీ కౌన్సిలర్ బి.పద్మారావును కాంగ్రెస్ పార్టీ నుంచి సంవత్సరం క్రితమే బహిష్కరించామని, అతనికి కాంగ్రెస్ పార్టీకి ఎలాంటి సంబంధం లేదని ఆపార్టీ మణికొండ మున్సిపాలిటీ అధ్యక్షుడు ఎం.జితేందర్ అన్నారు. స్వార్థ రాజకీయాల కోసం కాలనీ వాసులపై దాడులకు దిగటం బాధాకరమన్నారు.

సంఘటనా స్థలంలో లేకున్నా కేసు...

శనివారం వెంకటేశ్వర కాలనీ సంఘటన జరిగిన సమయంలో తాను అక్కడ లేకపోయినా తనను కేసులో ఇరికించారని బీఆర్ఎస్ పార్టీ మణికొండ సోషల్ మీడియా అధ్యక్షుడు షేక్ ఆరిఫ్ ఖాను అభ్యంతరం తెలిపారు. కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఉపేంద్రనాథ్‌రెడ్డి స్టేజీపైననే నిల్చుని ఉన్నా కేసు నమోదు చేశారన్నారు. మణికొండ మున్సిపాలిటీ మాజీ చైర్మన్ కె.నరేందర్, అతని అనుచరుల ప్రణాళిక ప్రకారమే తమనే కేసులో ఇరికించారని, దానిపై న్యాయ పోరాటం చేస్తామన్నారు. పోలీసులు నిష్పక్షపాత విచారణ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

బీరప్ప స్వామి ఆలయ అభివృద్ధికి కృషి

మణికొండ కురుమ సంఘం చైర్మన్ జైహిందరావు

మణికొండ: బీరప్ప, మల్లన్న స్వామి దేవాలయాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కురుమ సంఘం సభ్యులంతా కలసికట్టుగా కృషి చేయాలని సంఘం చైర్మన్ బి.జైహింద్‌రావు అన్నారు. ఆదివారం కురుమ సంఘం అధ్యక్షుడు సి.బీరప్ప అధ్యక్షతన దేవాలయ ఆవరణలో కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బీరప్ప సదనం, కురుమ సంఘం భవన నిర్మాణాలను రాబోయే రోజుల్లో నిర్మించాలన్నారు. అందుకు సభ్యులందరూ తన వంతు బాధ్యతగా సహకరించాలన్నారు. ఇప్పటి వరకు మల్లన్న స్వామి దేవాలయం, సదనం నిర్మాణం పూర్తి కావటంతో ఎంతో మందికి సౌకర్యంగా మారిందన్నారు. సంఘం ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్‌రావు, కోశాధికారి ఎన్.గణేష్, సభ్యులు బి.మల్లేష్, ఇ.యాదయ్య, బి.శ్రీరాములు, డి.బాబురావు, బి.ముత్యాలు, బి.శ్రీరాములు, జె.లక్ష్మయ్య, బి.ఆంజనేయులు, డి.కృష్ణ, డి.లక్ష్మణ్, బి.శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.